# ముప్పు తెచ్చిన మూడు ప్రశ్నలు

(జాగృతి మాస పత్రిక- 1994 దీపావళి హాస్యకథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ)



డిగ్రీ చదువు పూర్తి అయ్యాక పేపర్లో పడ్డ అడ్డమైన ఉద్యోగానికీ దరఖాస్తు చేయడం అందరిలాగానే రాగిణికీ మామూలయిపోయింది.

చాలా పరీక్షలకి రాత పరీక్షలు, ఆ తర్వాత అవసరం లేకపోయినా ఇంటర్వ్యూలు ఉంటాయి. రాత పరీక్షలన్నింటిలోనూ పాసయ్యేది. ఆ తర్వాత ఇంటర్వ్యూకి కూడా పిలుపు తప్పకుండా వచ్చేది. ఇంటర్వ్యూ పేరుతో తలాతోకా లేని, ప్రకటించిన ఉద్యోగానికి ఎంతమాత్రం సంబంధం లేని ప్రశ్నలు వేస్తుండేవారు.

వాటన్నిటికీ సరిగ్గా జవాబు చెప్పినా కూడా ఉద్యోగం మాత్రం వచ్చేది కాదు. అందులోని మతలబు ఏమిటో అర్థంకాక సతమతమయ్యేది.

రాగిణి ఫ్రెండ్స్ అంటుండేవారు-

"పిచ్చిదానా! ఇంటర్వ్యూలు బాగా చేసినంతమాత్రాన ఉద్యోగం వస్తుందనుకుంటున్నావా? ఉత్తర దక్షిణాలని గట్టి పట్టుపట్టందే రాదు". అని.

'ఉత్తరం' అంటే... రికమండేషనట! అంతటి ఉద్ధండ పిండాలెవరూ ఆ అమ్మాయికి అందుబాటులో లేరు. 'దక్షిణ' అంటే... లంచం. అదిచ్చే స్తోమతే లేదు. మనసూ ఒప్పదు. పోనీ... మనసనే ఆ కనిపించని పదార్థాన్ని చంపుకుని స్తోమత అరువు తెచ్చుకుని సమర్పించుకుందామనుకున్నా- ఏర్పాటులు పోయి ఎవరికి, ఎంత, ఎలా ముట్టజెప్పాలో తెలియదు. తెలుసుకోవాలన్నా చెప్పేవారు లేరు. అసలు ఆ మతలబులు తెలిసిన పైరవీకారులు ఎక్కడ దర్శనం ఇస్తారో అసలు తెలియదు. అందువల్ల దేముడి మీద భారం వేసి మంచిరోజుల కోసం ఎదురుచూస్తుండేది.

ఒకరోజున రాగిణికి హైదరాబాద్‌లోని ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థనుంచి కాల్ లెటర్ వచ్చింది. ఉన్నవి రెండే రెండు పోస్టులు. ఇంటర్వ్యూకి వచ్చిన వారు మాత్రం ఇరవైమంది ఉన్నారు.

వచ్చిన అభ్యర్థులు వారిలో వారు అనుకుంటున్నారు-

"మన పిచ్చి కాని.., వాళ్ళకి కావలసిన కేండెట్ల సెలక్షన్ ఎప్పుడో అయిపోయింది. ఇంటర్వ్యూలో సెలక్టు అయినట్లుండాలి కాబట్టి ఈ నాటకం! ఆ అండదండల వారెవరో మన మధ్యలోనే ఉన్నారు. మనల్ని మాత్రం కాసేపు ఆ ప్రశ్నలూ, ఈ ప్రశ్నలూ వేసి కాలక్షేపం చేస్తారు. మనకి అనవసర శ్రమ, డబ్బు దండుగాను!" అని ఒకరు అనగానే-

"వెళ్లగానే తండ్రి పేరు, ఊరు వగైరా అడుగుతారు. ఎందుకో తెలుసా? మనం వాళ్ళ కాండిడేట్ అవునో, కాదో గుర్తుపట్టడానికి!" అని మరొకరు అన్నారు.

"తలాతోకా లేని ప్రశ్నలు వేశారనుకోండి- దాని అర్థం... ఆ ఉద్యోగం మనకోసం కాదని చెప్పడానికన్నమాట!" అని ఇంకొకరు అన్నారు.

ఈలోగా ఇంటర్వ్యూకి వెళ్లిన వారిలోని ఒకతను ఆ గదిలోంచి బయటకు వచ్చాడు. వెంటనే అందరూ అతన్ని చుట్టుముట్టారు- "ఏం అడిగారు?" అంటూ.

"నీకు హిందీ సినిమాలు ఇష్టమా? తెలుగు సినిమాలు ఇష్టమా?"

"నీకు పాప్ మ్యూజిక్ వచ్చా? వస్తే నీ అభిమాన సింగర్ ఎవరు?"

"పాక్- ఇండో యుద్ధం ఎప్పుడు జరిగింది? ఎవరెవరికి జరిగింది?"

... ఇలా ఉన్నాయి ఆ ప్రశ్నలు.

అతను ఇంకా ఏదో చెప్తుండగా రాగిణికి పిలుపు వచ్చింది.

దడదడలాడే గుండెలతో లోనికి వెళ్లింది ఆ అమ్మాయి.

లోపల ఒక పెద్ద ఓవల్ షేప్డ్ బల్లకి మూడు వైపులా త్రిమూర్తులులాగా ముగ్గురు కూర్చొని ఉన్నారు. నాలుగోవైపు కుర్చీలో- అంటే... ఆ మధ్యన ఉన్న విష్ణుమూర్తిగారికి ఎదురుగా ఉన్న కుర్చీలో రాగిణిని కూర్చోమన్నారు.

ఆ అమ్మాయి పేరు, ఊరు, తండ్రి పేరు, ఆయన ఉద్యోగం వగైరాలు అడిగాక బ్రహ్మగారు-

"ఇప్పుడు ఈ రూంలో టెంపరేచర్ ఎంత ఉంటుంది?" అని అడిగారు.

కొంచెం ఆలోచించి, "38 డిగ్రీలు ఉండవచ్చు" అంది రాగిణి.

"ఉండవచ్చు-అంటే... నీమీద నీకే నమ్మకం లేదన్నమాట!" అన్నాడు ఆయన.

"నీకు తెలిసిన కర్ణాటక విద్వాంసుని పేరు చెప్పు?" విష్ణుమూర్తిగారు ముచ్చటగా అడిగారు ప్రశ్న.

"బాల మురళీ కృష్ణ!" తడబడకుండా చెప్పింది రాగిణి.

"ఆయన రికార్డు ఇచ్చిన వాటిలో ఒక కీర్తన పేరు, దాని రాగం చెప్పు?"

రాగిణి మౌనంగా ఉండిపోయింది.

"నీకీ ఉద్యోగం ఇస్తే పెళ్ళయ్యాక మానేస్తావా?" ముక్కంటిగారి మూడవ ప్రశ్న.

అప్పటికే నీరుగారిపోయింది ఆ అమ్మాయి.

"అది అప్పటి పరిస్థితిని బట్టి ఉంటుంది" అంది.

అంతే... ఇంటర్వ్యూ అయిపోయింది.

ఫలితం ఏమిటో ముందుగానే ఊహించుకుంటూ బయటకు వచ్చింది రాగిణి.

మళ్లీ అందరూ ఆ అమ్మాయి చుట్టూ మూగారు. వాళ్ళు అడిగిన ప్రశ్నలన్నిటికీ బదులిచ్చి, ఊసురోమంటూ బల్లమీద కూలబడింది రాగిణి.

"వీళ్ళకి సరియైన పాఠం నేను నేర్పుతానే! అంతేకాదు.., వారంలోగా వాళ్ళు చచ్చినట్లు నాకీ ఉద్యోగం ఇచ్చేట్లు చేస్తా చూడు!" అంటూ ఛాలెంజి విసిరింది వనజ.

ఆ అమ్మాయి రాగిణి క్లాస్‌మేట్.., క్లోజ్ ఫ్రెండ్! ఆ అమ్మాయి ధైర్యమేమిటో రాగిణికి అర్థంకాలేదు. జోక్ చేసిందనుకొంది. తనకి ఆలస్యం అవుతుందని వనజకి చెప్పి ఇంటికి వెళ్లిపోయింది రాగిణి.

ఆశ్చర్యం..!

మరో వారంరోజుల్లో వనజకు ఉద్యోగం వచ్చింది. రాగిణికి తెలిసినంత వరకు వనజకు ఉత్తర దక్షిణాలేవీ లేవు. ఉండబట్టలేక-

"ఛాలెంజి చేసినట్లు ఉద్యోగం సంపాదించావు. ఇంతకీ... ఇంటర్వ్యూలో నిన్ను ఏమని అడిగారే?" అని అడిగింది.

"ఇదంతా పట్టుకొట్టై కుమారస్వామి అనుగ్రహం!" అంది వనజ- తాదాత్మ్యంతో కళ్లు మూసుకుని, చిరునవ్వు నవ్వుతూ.

"ఆయనెవరు?"

"ఏమో... నాకు మాత్రం తెలుసా?"

"సరిగ్గా చెప్పవే... నీ వంకర వాగుడు మాని!"

"సరే విను! ఇంటర్వ్యూ ఇలా సాగింది-"

* * *

"ప్రపంచంలో అతి తెలివైన ప్రాంతం ఎక్కడుంది?" బ్రహ్మంగారి ప్రశ్న.

"పసిఫిక్ మహా సముద్రంలో ఫిలిప్పీన్స్‌కి ఆవల!"

"నీ అభిమాన కర్ణాటక సంగీత గాయకుడు ఎవరు?" విష్ణుగారు చిద్విలాసంగా చిదిపిన ప్రశ్న.

"పట్టుకొట్టై కుమారస్వామి!"

"పట్టుకొట్టై కుమారస్వామా? ఆయనెవరు?" విష్ణుగారి ముఖంలో చిరునవ్వు మాయమై ఆశ్చర్యం చోటుచేసుకుంది.

"పట్టుకొట్టై కుమారస్వామి అంటే... ప్రఖ్యాత గాయక శిరోమణి మీకు తెలియక పోవడమేమిటి సార్? నన్ను పరీక్షిస్తున్నారు కాని.., ఆయన ఎంతటి పేరున్న విద్వాంసుడు? క్రిందటి త్యాగరాజ ఆరాధన ఉత్సవాలకు మదరాసునుంచి వచ్చి మన హైదరాబాదులో కూడా పాడారు."

"అవునవును... నేనూ విన్నాను. ఆయన గొప్ప విద్వాంసుడు!" శివుడుగారు వత్తాసు పలికారు.

"అవునవును... ఆ కచేరికి నేను కూడా వెళ్లాను. గొప్ప గాయకుడాయన!" బ్రహ్మగారి సపోర్టు.

"ఆ... జ్ఞాపకం వచ్చింది. రేడియోలో చాలాసార్లు విన్నాను. టీవీలో కూడా చూసేవాడిని... వారి ప్రోగ్రాములు అర్ధరాత్రివేళ వస్తాయి. పైగా... ఈ అరవ పేర్లు సరిగ్గా గుర్తుండి చావవు!" అని విష్ణుమూర్తిగారి ముక్తాయింపు.

"నువ్వు బి. యస్. సి. పాసయ్యావు కదా... గ్రూప్‌లో మెయిన్ ఏమిటి?" బ్రహ్మగారి కొసరు ప్రశ్న.

"బాటనీ..!"

"గుడ్... గులాబీలలో కొన్ని వందల రకాలు ఉన్నాయి కదా! వాటిలో మన దేశవాళీ రకం కాకుండా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గులాబీ రకం పేరు ఏదైనా చెప్పు?"

"రోసానా పాడెస్టా!"

"రోసానా పాడెస్టానా? ఈ పేరు విన్నట్టు లేదే! అది ఎక్కడిది?"

"ఏమిటి సార్... నా బాటనీ నాలెడ్జిని పరీక్షిస్తున్నారు కాని, మీరు వినకపోవడమేమిటి? ఇది బ్రెజిల్‌కి చెందినది. రోజ్ ఎగ్జిబిషన్ ప్రతిదాంట్లోనూ ఇది ఉండి తీరుతుంది."

"అవునవును. మొన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పెట్టిన రోజ్ షోలో ఈ రకానికి మొదటి బహుమతి వచ్చిందని పేపర్లలో చదివాను" విష్ణుమూర్తిగారి వత్తాసు.

"మీరు చెప్పింది నిజమే! ఆ రకాన్ని నేను చూశాను కూడా. ఆరంజి చక్ గ్రౌండ్ మీద గ్రీనిష్ రెడ్ కలర్ ఉంటుంది. వారం రోజులకి కూడా వాడదు. పువ్వు కూడా డాలియా అంత పెద్దగా ఉంటుంది" శివుడిగారి సపోర్టు.

"వెరీగుడ్..! ఈమధ్య లక్నోలోని బొటానికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌వారు గింజలు లేని చింతపండుని సంకర జాతిగా రూపొందించారు. ఆ వార్త నువ్వు కూడా పేపర్లో చూసి ఉంటావు. దాని పేరు చెప్పగలవా?"

"వాగబాండస్ ఇండికా!"

"నేను మరేదో పేరు చదివినట్లున్నానే..!"

"అదేమిటి సార్... మీకు జ్ఞాపకం లేకపోవడమేమిటి సార్- నన్ను కన్‌ఫ్యూజ్ చేయాలని చూస్తున్నారు కాని..!"

"ఆ పేరు కరెక్టేనండీ! ఆ హైబ్రిడ్ రకం గురించి ఒక ప్రత్యేక వ్యాసం నేను బొటానికల్ జర్నల్‌లో చదివాను" బ్రహ్మగారి భాష్యం.

"ఒకసారి టీవీలో టర్నింగ్ పాయింట్‌లో కూడా వచ్చిందండీ! నేను చూశాను... నాకు బాగా జ్ఞాపకం!" విష్ణుగారి విశేష పరిజ్ఞానం.

"చూడమ్మా... పెళ్ళయ్యాక ఉద్యోగం మానివేయమని మీ ఆయన కోరితే మానేస్తావా?" విష్ణుమూర్తిగారి కొసరు ప్రశ్న.

"ఉద్యోగం చేయడానికి అభ్యంతరంలేని వాడినే చేసుకుంటాను."

"ఫైన్... ఓ.కె.! యూకెన్ గో... త్వరలోనే రిజల్టు తెలియబరుస్తాం!"

"థాంక్యూ సర్... రిజల్టు పంపుతారా? అపాయింట్‌మెంట్ ఆర్డరా?"

"వాట్ డూ యూ మీన్? ఆర్ యూ సో ఓవర్ కాన్ఫిడెంట్?" కోపంగా అన్నాడు విష్ణుమూర్తిగారు.

"పొన్లెండి సార్... పట్టుకొట్టై కుమారస్వామిగారు ఈసారి కనిపించినప్పుడు నా తరపున థాంక్స్ చెప్పండి!"

"వాటీజ్ దిస్ నాన్సెన్స్?" ముగ్గురూ ఒకేసారి అరిచారు.

"ఐయామ్ ఫుల్లీ ఇన్ సెన్స్! సెన్స్ లెస్‌గా మాట్లాడింది మీరు. అసలు 'పట్టుకొట్టై కుమారస్వామి' అనే మనిషి ఉంటేగా! నేను గట్టిగా దబాయించేసరికి- 'అవునవును... విన్నాం, చూశాం!' అంటూ మీరు తలలూపారు. 'రోసానా పొడెస్టా' అనేది ఒక ఇటాలియన్ సినీ నటి పేరు. నేను గట్టిగా గద్దించేసరికి ఆ పువ్వు చూసినట్లు వర్ణించారు. దాన్ని గురించి చదివినట్లు కోశారు. 'టామారిండస్ ఇండికా' అనేది చింతచెట్టు పేరు. 'వాగబాండస్ ఇండికా' అంటే లిటరల్‌గా 'భారతీయ తిరుగుబోతు!' అని అర్థం. నేను ధైర్యంగా చెప్పేసరికి, దానిని గురించి చదివినట్లు, టీవీలో చూసినట్లు కోతలు కోశారే... ఇటువంటి మీరా- నన్ను ఇంటర్వ్యూ చేసేది? ఈ ఉద్యోగానికి కావలసిన అర్హతకంటే ఎక్కువ అర్హతలే నాకు ఉన్నాయి. ఈ ఉద్యోగం పదిరోజుల్లోగానీ నాకు రాకపోతే మీ బండారాలను పేపర్లలో బట్టబయలు చేస్తాను. నేను రైటర్ని కూడా..! ఈ వ్యవహారం ఈ నాలుగు గోడల మధ్యనే ఉంటుందనుకుంటే అది పొరపాటు. దీనిని బట్టబయలు చేయగల తిరుగులేని సాక్ష్యాలు నా దగ్గర ఉన్నాయి. ఇప్పటికే మీరు షాక్ తిన్నారు- ఆ సాక్ష్యాలేమిటో తెలిస్తే మీరు మూర్ఛపోతారు. ఏమైతేనేం- నేను జంటిల్ ఉమన్‌గా ఈ పది రోజుల్లో ఈ విషయాన్ని ఎవ్వరికీ చెప్పను... ఆఖరికి మా వాళ్ళకి కూడా! మీరు మర్యాదగా ఉద్యోగం ఇస్తే మీ వ్యవహారం మన నలుగురి మధ్యనే ఉంటుంది. ఇవ్వకపోతే ప్రపంచమంతా వ్యాపిస్తుంది. ఆలోచించుకోండి... వస్తాను!"

* * *

"వండర్‌ఫుల్..! ఆ తర్వాత ఏమయింది?"

"ఇంకేమవుతుంది? షాక్ నుంచి తేరుకోవడానికి వాళ్ళకి ఆరు రోజులు పట్టింది. ఏడో రోజున వచ్చినట్లు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ పంపించారు" అంటూ పగలబడి నవ్వింది వనజ.

"అంటే... బ్లాక్‌మెయిల్ చేసి ఉద్యోగాన్ని కొట్టేశావన్న మాట! నువ్వన్నట్లు వాళ్ళకి భలే పాఠం నేర్పావే!" అని అభినందించింది రాగిణి.

"లంచాల గడ్డి మేసే వాళ్ళకి ఇలాగే శాస్తి చేయాలి!" అంది వనజ.

"అది సరే... కుమారస్వామిగారు పాడిన కీర్తనలు, రాగాలు, ఆ గులాబీ వివరాలు, చింతచెట్టు సంగతులు గట్టిగా అడిగారనుకో... బయటపడిపోయేదానివి కాదూ?" అంది రాగిణి నిర్లక్ష్యంగా.

"ఓసి సత్తెకాలపు సత్తెమ్మా... అసలు పుట్టనే పుట్టని పట్టుకొమ్మని పుట్టించిన దాన్ని.., సృష్టిలో లేని గులాబీని, చింతచెట్టుని సృష్టించిన దాన్ని.., ఎవరూ వినని కీర్తననీ, ఎవరికీ తెలియని రాగాన్నీ సృష్టించలేనా? అలాగే మిగతావీను. గట్టిగా దబాయిస్తే- 'అవునవును...' అంటూ తలలు ఆడించేవాళ్ళు!"

"అది సరే కాని.., నువ్వు ఉద్యోగంలో చేరాక ఈ విషయం టాంటాం చేయవని వాళ్ళకి నమ్మకమేమిటి?"

"ఈ విషయంలో ఉమన్- జెంటిల్మన్ అగ్రిమెంట్ ఉంది. నిన్న డ్యూటీలో జాయిన్ అవడానికి వెళ్లినప్పుడు యం. డి. ముఖానికి నవ్వు పులుముకొని ఇలా అన్నారు-

'చూడు మిస్ వనజా... యూ ఆర్ టూ స్మార్ట్. యూ విల్ బి ఏన్ ఎసెట్ టు అవర్ ఆఫీస్. చూడు... ఐ యామ్ వెరీ ప్లెయిన్. నువ్వు కోరినట్లు నీకు ఈ జాబ్ ఇచ్చాం. అఫ్‌కోర్స్... యూ ఆర్ వెల్ క్వాలిఫైడ్. మొన్న జరిగింది నీవు ఎవ్వరికీ చెప్పకూడదు. మర్చిపోవాలి. ఒకవేళ టూ స్మార్ట్‌గా- ఎలాగైతేం ఉద్యోగం వచ్చింది కదా... అన్న ధీమాతో ఎవరికైనా చెప్పావనుకో- ఏదో కారణం చూపి నిన్ను తీసేయడం మాకు కష్టం కాదు. నీకు వేరే ఉద్యోగం రాకుండా బాడ్ రిపోర్ట్ ఇచ్చి పంపగల అవకాశం కూడా మాకు ఉంది. అఫ్‌కోర్స్... యూ ఆర్ ఇంటలిజెంట్ టు అండర్‌స్టాండ్ ఆల్ దీజ్ థింగ్స్! విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!' అన్నాడు.

నేనూ అందుకు మర్యాదగా ఒప్పుకుని డ్యూటీలో జాయినయ్యాను. నాకీ జాబ్ కావాలి. వాళ్ళకి పరువు నిలవాలి. అందుకే ఈ జెంటిల్‌మెన్ అగ్రిమెంట్!" అంది వనజ.

"వాళ్ళేం జెంటిల్‌మెన్ కాదులే... ఇంక ఒళ్లు దగ్గర పెట్టుకుంటారు" అంది రాగిణి.

"యూ ఆర్ రైట్! ఈ విషయం మా వాళ్ళకు కూడా చెప్పలేదు. కేవలం నీకు మాత్రం చెప్పాను. నీవు కూడా విననట్లే మరిచిపోవాలి" అంది వనజ.

"అది వేరే చెప్పాలా..?" అంది రాగిణి- వనజ భుజం నొక్కుతూ.

*-జాగృతి... దీపావళి ప్రత్యేక సంచిక ' 94*